నమస్తే తెలంగాణ

పంజరంలో చిలుక

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు కావడంతో మద్యం పాలసీ కేసులో ఒక అంకం పూర్తయింది. బెయిల్‌పై వాదనల సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కేంద్ర దర్యాప్తు సంస్థలకు, ముఖ్యంగా సీబీఐకి చెంపపెట్టు లాంటివని చెప్పాలి. 'బెయిల్ ఇవ్వడం సర్వదా వాంఛనీయం. కానీ, జైలు అనేది అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే వర్తింపజేయాలి. పంజరంలో ఉన్న పెంపుడు చిలకలా ప్రవర్తించవద్దు. ఆ ముద్రను చెరిపేసుకోవాల్సిన బాధ్యత సీబీఐ మీదే ఉన్నద'ని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయ పడటమే అందుకు కారణం. ఈ మందలింపుల నేపథ్యంలో సీబీఐ ఏమైనా నేర్చుకుంటుందా? అనేది సందేహాస్పదమే. ఎందుకంటే, పెంపుడు చిలుక పంజరం నుంచి తనంతట తానుగా బయటకు వచ్చి స్వేచ్ఛగా ఎగరలేదు. అది ఎగరాలంటే దాన్ని పంజరంలో బంధించినవాళ్లు మొదట మారాలి. అప్పుడే బంధనాలను తెంపుకొని తనదైన వాస్తవ కర్తవ్యం దిశగా చిలుక ఎగురగలుగుతుంది.

ఒకప్పుడు జాతీయ దర్యాప్తు సంస్థలంటే వెన్నులో వణుకు పుట్టేది. అవి రంగంలోకి దిగాయంటే నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. ఎందుకంటే, ఎలాంటి లాలూచీ లేకుండా, రాజీపడకుండా అవి దర్యాప్తు జరుపుతాయని గట్టి నమ్మకం. ఇదంతా గత చరిత్ర. రానురాను వాటి పరిస్థితి దిగజారుతూ వస్తున్నది. ఈ దిగజారుడు ధోరణి కాంగ్రెస్ హయాంలోనే మొదలైంది. సుప్రీంకోర్టు ప్రస్తావించినట్టుగా సుకుమారమైన చిలుకలా కాకుండా, మెడలో గొలుసు ఉన్న పెంపుడు కుక్కలా వ్యవహరించేవని కేంద్ర దర్యాప్తు సంస్థలు అప్పట్లోనే తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించడం వల్ల వాటి ప్రతిష్ఠ కొంతమేరకు మసకబారగా.. బీజేపీ నేతృత్వంలోని మోదీ సర్కార్ ఇష్టారాజ్యంగా ఉపయోగిస్తున్న తీరుతో అది మరింతగా భ్రష్టుపట్టింది. అన్ని కేసులు అదే తరహాలో జరుగుతున్నాయని చెప్పలేం కానీ, రాజకీయ కేసుల విషయంలో మాత్రం దర్యాప్తు సంస్థల తీరు వివాదాస్పదమవుతూనే ఉన్నది. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం. సుప్రీంకోర్టు అక్షింతలతో ఈ విషయం మరోమారు స్పష్టమైంది.

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీబీఐ వ్యవహరించిన తీరు మొదటి నుంచీ సందేహాస్పదమే. నెలల తరబడి ఈడీ కేసు నడుస్తుంటే చూస్తూ కూర్చున్న సీబీఐ.. ఆ కేసులో బెయిల్ లభించగానే ఉన్నపళంగా ఆయనపై కేసు దాఖలు చేయడం గమనార్హం. విపక్ష నేతలపై సీబీఐ, ఈడీలను ప్రయోగించడం, వారు బీజేపీకి వత్తాసు పలకగానే కేసుల నుంచి విముక్తి కల్పించడం ఈ మధ్య పరిపాటిగా మారింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఉదంతం అందుకు చక్కటి ఉదాహరణ. సుప్రీం వ్యాఖ్యల తర్వాతైనా దర్యాప్తు సంస్థల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, నిగ్గుతేలే కేసుల సంఖ్య కూడా పెరగాలి. అందుకు మొదటగా దర్యాప్తు సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించాలి. అలా జరగాలంటే ముందుగా వాటిని కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో నుంచి బయటపడేయాలి. ఆమూలాగ్రం పారదర్శకత తేవాలి. పూర్తిస్థాయి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. వాటి నియంత్రణను పూర్తిగా పార్లమెంటరీ కమిటీకి అప్పగించాలి. ఇలాంటి విప్లవాత్మక మార్పులు జరిగితే తప్ప కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరు మెరుగుపడదు. అయితే బీజేపీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ హయాంలో అది జరుగుతుందని ఆశించడం అత్యాశే.

ప్రమాదపుటంచుల్లో ప్రజాస్వామ్యం

1948 సెప్టెంబర్ 17 అనేది హైదరాబాద్ స్టేట్‌కు విమోచన దినమా? లేదా భారత యూనియన్‌లో విలీనమైన రోజా? లేదా విద్రోహ దినమా? ఇది కొంతకాలంగా చర్చనీయాంశంగా మారుతున్న అంశం. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత రెండేండ్లుగా దీన్ని విమోచన దినంగా జరుపుకొంటున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపగా.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మాత్రం ప్రజాపాలన దినోత్సవంగా పేర్కొంటున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు ఎంతో ముఖ్యమైన సెప్టెంబర్ 17 వెనకున్న అసలు వాస్తవమేమిటి? ఈ ప్రజా ఉద్యమానికి ఉన్న రాజకీయ వారసత్వ చట్టబద్ధత ఎవరికి సొంతం? అనేది ఇప్పుడు చర్చనీయాంశం.

డాక్టర్
చెన్నమనేని రమేశ్



కమ్యూనిస్టులు, సోషలిస్టులు, రైతు సంఘాల నేతృత్వంలోని రైతులు పోరాటాల ద్వారా సమ్మిళిత భారతదేశ పరిణామంలో కీలకపాత్ర పోషించారు. అనేక రైతాంగ పోరాటాలు చేశారు. కేరళలోని పున్నప్రవాయలార్‌లో భూసమస్యపై సాగించిన పోరాటాలు, బెంగాల్‌లో తెభాగ ఉద్యమం, అసోంలో సుర్మా వ్యాలీ పోరాటం, మహారాష్ట్రలో వార్లీ తిరుగుబాటు, భూ సంస్కరణలు, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటం వాటిలో ప్రధానమైనవి.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు హైదరాబాద్ రాష్ట్రం రాచరిక పాలనలో ఉండేది. నిజాం నాయకత్వంలోని హైదరాబాద్‌లో పోలీసు పటేల్ (శాంతిభద్రతలు), మాలి పటేల్ (రెవెన్యూ), పట్వారీ (భూ రికార్డులు)లతో కూడిన పాలనావ్యవస్థ ఉండేది. పై స్థాయిలో గిర్దావర్లు, తహశీల్దార్లు, తాలుక్‌దార్‌లు ఉండేవారు. వీరు నిజాంకు వీర విధేయులు. హైదరాబాద్ స్టేట్‌లోని నలభై శాతం భూములు నిజాం ఆధీనంలోనే ఉండేవి. భూస్వాముల చేతుల్లో ఉన్న మిగిలిన అరవై శాతం భూముల్లో వెట్టిచాకిరీ చేయించేవారు.

ఈ నేపథ్యంలో 1928లో మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి తదితరుల నాయకత్వంలో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. ఆంధ్ర మహాసభ నేతృత్వంలో రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, హసన్ నసీర్, భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు వెంకట నరసింహారెడ్డి. మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, రాజ్ బహదూర్ గౌర్, బద్దం ఎల్లారెడ్డి, అనభేరి ప్రభాకర్, చెన్నమనేని రాజేశ్వరరావు తదితరులు నిజాం అణచివేతలపై సాయుధ పోరాటం సాగించారు. 1946-51 మధ్యకాలంలో జరిగిన ఈ ఉద్యమంలో 60 వేలమందికి పైగా ఆయుధాలు చేతబట్టి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ పోరులో సుమారు 4,500 మందికి పైగా ప్రాణాలర్పించారు.

ఈ నేపథ్యంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1948, సెప్టెంబర్ 13న పోలీస్ యాక్షన్ జరిగింది. అనంతరం జనరల్ జేఎన్ చౌధురీ నేతృత్వంలో మిలిటరీ పాలన ప్రారంభమైంది. చౌధురీ అణచివేతల కారణంగా నిజాం వ్యతిరేక పోరాటం కాస్త భారత మిలిటరీతో పోరాటంగా మారింది. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీలో కొత్త చర్చ మొదలైంది. రావి నారాయణరెడ్డి నాయకత్వంలోని సాయుధ దళాలు పోరాటాన్ని విరమించాలని నిర్ణయించుకున్నాయి. కానీ, అలా చేస్తే ప్రజల్లో విశ్వాసం కోల్పోతామని, ద్రోహులుగా మిగిలిపోతామని మరో వర్గం వాదించింది. అణచివేతలు, అరెస్టుల కారణంగా పోరాటాన్ని నిలిపివేస్తున్నట్టు 1951 అక్టోబర్ 21 సీపీఐ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 17ను మనం విశాలమైన దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉన్నది. నిస్సందేహంగా తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగానే నిజాం పాలన ముగిసి, భారత యూనియన్‌లో హైదరాబాద్ స్టేట్ విలీనమైంది. 'పోలీస్ యాక్షన్ జరగకపోయినా నిజాంను మేం గద్దె దించేవాళ్లం' అని రావి నారాయణరెడ్డి స్వయంగా చెప్పారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆర్య సమాజ్‌కు గాని, హిందూ మహాసభకు గాని, ఆర్ఎస్ఎస్‌కు గాని ఎలాంటి పాత్ర లేదు. దశాబ్దాల కిందటి వరకు గంగా జమునా తెహజీబ్‌లా అన్ని వర్గాల వారు కలసిమెలసి ఉన్న ఈ ప్రాంతంలో మతపరమైన విద్వేషాలు సృష్టించి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే వారు సాధించింది. ముస్లింల ఊచకోతపై భారత ప్రభుత్వం నియమించిన సుందర్‌లాల్ కమిటీ కూడా ఇదే నివేదించింది. ఈ ప్రాంతం నిజాం రాజ్యంగా ఉన్నప్పటికీ అది ఏ మతంతోనూ బలమైన బంధం కలిగిలేదు. ఈ నేపథ్యంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన హిందూ భూమిగా తెలంగాణను చిత్రీకరించడం, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌ను తెలంగాణ విముక్త యోధుడిగా చూపించే ఆలోచన బీజేపీ చేస్తున్నది. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ముస్లిం వ్యతిరేక ఉద్యమంగా, భారత యూనియన్‌లో విలీనం చేయడాన్ని విముక్తిగా చూపించే కుట్ర అందులో దాగి ఉన్నది.

ఎన్ని వక్రీకరణలు ఉన్నప్పటికీ, ఏడు దశాబ్దాల కిందట తెలంగాణ రైతాంగ పోరాటం జరిగిందనేది నిస్సందేహంగా వాస్తవం. ఆరు దశాబ్దాల కిందట 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో కమ్యూనిస్టులు పోరాటం సలిపారు. ఐదు దశాబ్దాల కిందట ప్రత్యేక తెలంగాణ కోసం విద్యార్థి ఉద్యమం జరిగింది. నాలుగు దశాబ్దాల కిందట పౌరహక్కుల ఉద్యమానికి కేంద్రబిందువైంది. 1970ల దశకంలో దేశంలో మహిళల హక్కుల సంఘాలు ఏర్పడ్డాయి. ఇలా అన్ని వర్గాలు ప్రత్యేక తెలంగాణ కోసం డిమాండ్ చేసి, సాధించుకున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం తమ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఎజెండాలను కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణలో దశలవారీగా అమలు చేయాలని కొన్ని శక్తులు చూస్తున్నాయి. భారతదేశం తన 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఇటీవల జరుపుకొన్న తరుణంలో రాజకీయ, సామాజిక పోరాటాలను మనం విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉన్నది. లౌకిక, ప్రజాస్వామ్య, రిపబ్లిక్, సమాఖ్య వ్యవస్థలతో కూడిన భారత రాజ్యాంగంపై ఆధారపడి మన రాజకీయ వ్యవస్థ నడుస్తున్నది.

భారత రాజ్యాంగానికి మూలాధారమైన నాలుగు పిల్లర్ల వంటి లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజం, ఆర్థిక స్వావలంబన ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి. ఈ తరుణంలో వాటిని సంరక్షించుకోవడమే ఇప్పుడు ప్రజాస్వామ్యవాదులు, ప్రగతిశీల శక్తుల ముందున్న అతిపెద్ద సవాల్.

(వ్యాసకర్త: వేములవాడ మాజీ ఎమ్మెల్యే)

రాజకీయ లబ్ధి కోసం తమ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఎజెండాలను కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణలో దశలవారీగా అమలు చేయాలని కొన్ని శక్తులు చూస్తున్నాయి. భారతదేశం తన 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఇటీవల జరుపుకొన్న తరుణంలో రాజకీయ, సామాజిక పోరాటాలను మనం విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉన్నది.

హైదరాబాద్ సంస్థాన సమరయోధుడు

సురభి వాణీదేవి

'వందేహం, మదురుం, శాంతం/ కాషాయాంబర శోభితం స్వాతంత్ర్యసరోల్లాసం/ రామానందాఖ్య నాయకం...' అని కళాప్రపూర్ణ డాక్టర్ దాశరథి అన్నారు. ఆయన చెప్పినట్టు.. హైదరాబాద్ స్టేట్ ప్రజలకు రాచరికం నుంచి విలీనం/ విముక్తి కలిగించిన వ్యక్తి స్వామి రామానంద తీర్థ.

బ్రిటిష్ ప్రభుత్వం 1947, ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించింది. అయితే, హైదరాబాద్ సంస్థానం మాత్రం భారతదేశంలో కలవడానికి నిరాకరించింది. అప్పుడు హైదరాబాద్ సంస్థానాన్ని అసఫ్ జాహీ వంశపు 7వ రాజైన 'మీర్ ఉస్మాన్ అలీఖాన్' పరిపాలిస్తున్న రోజులు. యావత్ భారతంలో తమ అధికారాన్ని వదులుకొని బ్రిటిష్ ప్రభుత్వం నిష్క్రమిస్తుండగా, అఖండ దేశంలోని చిన్న భాగంలో ఫ్యూడల్ నిరంకుశ పాలన ఉండటం చూడలేమని స్వామి రామానంద తీర్థ హెచ్చరించారు. అంతేకాదు, 1946, జూలై 3న 'భారతదేశంలో రాజకీయ విప్లవం వస్తున్న తరుణంలో హైదరాబాద్ సంస్థానం దీని నుంచి తప్పుకోజాలదు' అంటూ ప్రభుత్వానికి ధిక్కార స్వరం వినిపించారు. స్వామిజీ ఇచ్చిన ఈ నినాదానికి ప్రభావితులైన అనేకమంది యువతీ యువకులు 'వందేమాతరం' అంటూ హైదరాబాద్ సంస్థాన విలీన/ విమోచన సంగ్రామంలో దూకారు.

సంస్థానంలో నానాటికీ విషమించిపోతున్న పరిస్థితుల నుంచి కవులు, కళాకారులు, సామాన్యులు, మహిళలు, సమస్త ప్రజలకు విముక్తి కలిగించే ఏకైక ఆశాదీపం స్వామి రామానంద తీర్థ. ఆయన శిష్యరికంలో జాతీయ ఉద్యమ ప్రభావం వల్ల మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో పాటు ఇతర ప్రముఖులు 'వందేమాతరం' అంటూ నినదించారు. ఈ ఉద్యమం ఔరంగాబాద్, వరంగల్, గుల్బర్గా, నాందేడ్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ మార్మోగింది. సంస్థానంలో ప్రతి తాలూకాలో, పట్టణంలో సత్యాగ్రహాలు పుంజుకున్నాయి. జాతీయ పతాకం ఎగురవేసినందుకు పద్మజానాయుడిని అరెస్టు చేశారు. దేశభక్తుడు పండిట్ నరేంద్ర, బూర్గుల రామకృష్ణారావు, జి.రామాచారి, గణపతిరావు, జ్ఞానకుమారి హెగ్డే, వందేమాతరం రామచంద్రరావు, కాటం లక్ష్మీనారాయణ, వట్టికోట ఆళ్వారు, బిర్దీ చంద్ చౌదరీ, జీఎస్ మెల్కొటే, కాళోజీ నారాయణరావు, ఎం.ఎస్ రాజలింగం, దామోదర్ పాంగ్రేకర్, డి.బిందూ, జమలాపురం కేశవరావు, కొండా లక్ష్మణ్‌బాపూజీ లాంటి అనేకమంది నాయకులను జైళ్లలో బంధించారు. 1947 ఆగస్టు 7న త్రివర్ణ పతాకాన్ని చేతబూని, 'ఇండియా యూనియన్‌లో హైదరాబాద్ కలవాల'ంటూ సుల్తాన్ బజార్‌లో సత్యాగ్రహం ప్రారంభించడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి వరంగల్ జైలుకు పంపారు. సుప్రసిద్ధ కవి దాశరథి , ఇటిక్యాల మధుసూదన్‌రావు లాంటివారితో జైళ్లను నింపేశారు.

ఈ నేపథ్యంలో స్వామిజీ ఢిల్లీకి వెళ్లి సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్, నెహ్రూలను కలిశారు. హైదరాబాద్ సంస్థాన స్థితిగతులను, ఖాసీం రజ్వీ జరుపుతున్న దురాగతాలను వారిముందు ఏకరువు పెట్టారు. రజాకార్ల నిషేధానికి శాంతిభద్రతల దృష్ట్యా బొల్లారంలో భారత సైన్యాన్ని దించుతామని 1948 ఆగస్టు 31న అప్పటి ఇండియా గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి తెలిపారు. 1948 సెప్టెంబర్ 13 తెల్లవారుజామున భారత ప్రభుత్వ సైన్యాలు హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించాయి. కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మహారాజా, రాజేందర్ సింహాజీ నేతృత్వంలో భారత సైన్యం షోలాపూర్ నుంచి, రెండవ దళం విజయవాడ నుంచి మూడవ దళం అహ్మద్‌నగర్ నుంచి మూకుమ్మడిగా చుట్టుముట్టడంతో హైదరాబాద్ స్టేట్ ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

> **ఈ నేపథ్యంలో సుల్తాన్‌బజార్‌లో తన నివాసం వద్ద ప్రజలను ఉద్దేశించి స్వామిజీ ప్రసంగించారు. 'ఇది చరిత్రాత్మక పోరాటం, చెప్పలేని బాధలను అనుభవించిన మనం ఎన్నో అగ్ని పరీక్షలను ఎదుర్కొని ఘన విజయం సాధించాం. ఈ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వేలాదిమంది ప్రజలకు కార్యకర్తలకు, కర్షకులకు, కార్మికులకు, విద్యార్థులకు, మహిళామణులకు ఇదే నా అశ్రుతర్పణం' అని భావోద్వేగానికి గురయ్యారు.**

1948, సెప్టెంబర్ 17న నిజాం నవాబ్ హైదరాబాద్ రేడియో స్టేషన్ నుంచి ప్రసంగిస్తూ భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం బేషరతుగా విలీనమైందని ప్రకటించారు. 1972 జనవరి 22న స్వామిజీ శివైక్యం చెందారు. ఆ తర్వాత ఆయన అనుంగు శిష్యుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు స్వామిజీ సంస్మరణార్థం 'స్వామి రామానంద తీర్థ మెమోరియల్' సంస్థను బేగంపేటలో స్థాపించారు. ఇక్కడే 'స్వామిజీ సమాధి' ఉండటం గమనార్హం.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యురాలు, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ ప్రధాన కార్యదర్శి)

1940 దశకంలో ఉవ్వెత్తున ఎగసిపడ్డ నిజాం నిరంకుశ పాలన వ్యతిరేక పోరాటంలో బుర్రకథలు ప్రధాన భూమిక పోషించాయి. కథ పౌరాణికమైనా, చారిత్రకమైనా సమకాలీన సమాజాన్ని జోడించే వెసులుబాటు ఉండటం, నాటకం లాగా హంగు ఆర్భాటం అవసరం లేకపోవడం వల్ల బుర్రకథ పాటలాగే ప్రజలకు దగ్గరైంది. జంగం కథ, శారద కథ వంటి ప్రాచీన వారసత్వ ప్రజా కళా రూపాల కలయికతో గత శతాబ్దంలో కన్ను తెరిచిన బుర్రకథ ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది.

బుర్ర కథలపై కర్ర పెత్తనం

డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

నిజాం వ్యతిరేక ఉద్యమ సమయంలో ఎన్నెన్నో సాంస్కృతిక, సాహిత్య రూపాలు అగ్నికి గాలి తోడైనట్టు నిలిచాయి. ప్రత్యేకించి కష్టజీవి, తెలంగాణ, సీతారామరాజు బుర్రకథలు నిజాం పాలకులకు నిద్ర లేకుండా చేశాయి. చరిత్ర సృష్టించిన 'మా భూమి' నాటక రచయితల్లో ఒకరైన సుంకర సత్యనారాయణ కష్టజీవి బుర్రకథ సృష్టికర్త. భూమి కోసం, భుక్తి కోసం జమీందారును రైతులు ఎదిరించడం కథ. ఈ కథలోని 'జాగేలనోయి రైతు బాబయ్య' లెండు లెండు నిద్రలేలా 'గొంతెత్తి కేకేయరా' పాటలు విడిగా కూడా విపరీత ప్రచారం పొందాయి. నాటి ఉద్యమకారులకు గొప్ప ఆయుధం లభించినట్టయింది. గాలి కంటే వేగంగా వ్యాపించిన కష్టజీవి బుర్రకథ ప్రదర్శించని గ్రామం నాడు తెలంగాణలో లేదంటే అతిశయోక్తి కాదు. ఈ బుర్రకథ రూపకల్పనలో సుంకరకు కాకునూరు సుబ్బారావు సహకరించారు. ఇదే కథను తిరునగరి రామాంజనేయులు హరికథగా మార్చగా, శ్రీకాకుళ ఉద్యమ సమయంలో సుబ్బారావు పాణిగ్రాహి జముకుల కథగా మార్చి రాశారు. సుంకర కష్టజీవి బుర్రకథపై నాటి నిజాం ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇక సుంకర రాసిన మరో బుర్రకథ 'తెలంగాణ' పెను సంచలనమే సృష్టించింది. ఏకంగా నిజాం ప్రభువు మీదికే బాణం ఎక్కుపెట్టింది. రంగారెడ్డి అనే దేశ్‌ముఖ్‌తో పేద రైతైన గోపిరెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులు జరిపిన భూ పోరాటం దాని వృత్తాంతం. ఈ బుర్రకథను గ్రామాల్లో ఎక్కడికక్కడ ప్రదర్శిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. ఆ లేఖనందుకున్న అధికారులు 'తెలంగాణ' బుర్రకథతో పాటు మరో బుర్రకథ 'సీతారామరాజు' బుర్రకథను, దేవులపల్లి వెంకటేశ్వరరావు రచించిన 'నిజాం ఆంధ్రుల పోరాటం' పుస్తకాలను నిషేధించాలని సిఫారసు చేశారు.

ఈ మేరకు నిజాం ప్రభుత్వం నిషేధపు ఉత్తర్వులు జారీచేసింది. 1946, డిసెంబర్ 8న వెలువడిన ఐదు వేల 'తెలంగాణ' బుర్రకథ ప్రతులు ఉద్యమకారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పోలీసులకు ఎక్కడా లభించలేదు. చివరికి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన కార్వ నారాయణరెడ్డి, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కోదండరామిరెడ్డి ఇండ్లలో బుర్రకథ ప్రతులు పోలీసులకు లభించాయి. 48 పేజీల పాకెట్ సైజ్ చిన్ని పుస్తకంలో విస్నూర్ దేశ్‌ముఖ్ గుండాల చేతుల్లో బలైన తెలంగాణ పోరాట యోధుడు 'బందగీ' పరిచయం, నాగలితో దున్నుతున్న రైతు, ఎద్దుల కాళ్ల కింద పడి నలిగిపోతున్న నిజాం తలపాగా ముఖచిత్రం నాటి ప్రభుత్వానికి కోపం తెప్పించింది. నిజాం ప్రభువుకు చిర్రెత్తించిన సుంకర మరో బుర్రకథ 'సీతారామరాజు'. 1946, అక్టోబర్ 19న వెలువడింది. దీని ప్రతులు కూడా పోలీసులకు నారాయణరెడ్డి, కోదండరామిరెడ్డి ఇళ్లల్లో దొరికాయి. అల్లూరి సీతారామరాజు ఉద్యమానికి, ఉద్యమ ప్రాంతానికి నిజాం రాజ్యానికి ఏ మాత్రం సంబంధం లేదు.

48 పేజీల పాకెట్ సైజ్ చిన్ని పుస్తకంలో విస్నూర్ దేశ్‌ముఖ్ గుండాల చేతుల్లో బలైన తెలంగాణ పోరాట యోధుడు 'బందగీ' పరిచయం, నాగలితో దున్నుతున్న రైతు, ఎద్దుల కాళ్ల కింద పడి నలిగిపోతున్న నిజాం తలపాగా ముఖచిత్రం నాటి ప్రభుత్వానికి కోపం తెప్పించింది.

> **కానీ, అల్లూరి ఉద్యమస్ఫూర్తి ఎక్కడ తెలంగాణ ఉద్యమకారులను ప్రభావితం చేస్తుందోనని నిజాం ప్రభుత్వం నిషేధించింది. విజయవాడకు చెందిన పొన్నలూరి రాధాకృష్ణమూర్తి సీతారామరాజు నవల రాయడం కోసం మన్యం ప్రాంతం పర్యటించి విస్తృతమైన సమాచారం సేకరించారు. ఆ రాత ప్రతులను బ్రిటిష్ పోలీసులకు దక్కకుండా సుంకర దాచి ఉంచాడు. బహుశా ఈ బుర్రకథకు అదే ప్రేరణ కావచ్చు.**

ఈ బుర్రకథలను నియంత్రించడం నిజాం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. పుస్తక ప్రతుల అవసరం లేకుండా మౌఖికంగానే ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందాయి. ఎక్కడ ఏ మూలకు ఎవరు ఈ బుర్రకథలు చెబుతున్నారో? ఏ సంచార బృందాలు ఏ గ్రామాల్లో తిరుగుతున్నాయో? పసిగట్టలేని నిస్సహాయ స్థితికి చేరుకున్నారు పోలీసులు. తుదకు నిజాం ప్రభువు ఏకంగా 'బుర్రకథ' కళారూపాన్ని నిషేధించాడు. అది పౌరాణికమైన, చారిత్రకమైన కథ ఏదైనా బుర్రకథ ప్రదర్శించడానికి వీల్లేదని ఫర్మానా జారీచేశాడు.

మనం మరిచిన వీరచక్ర

బసవరాజు నరేందర్‌రావు
99085 16549

(నేడు కెప్టెన్ విజయ రఘునందన్‌రావు వర్ధంతి)

'వీరగంధము దెచ్చినారము–
వీరు డెవ్వడొ తెల్పుడీ!
పూసి పోదుము, మెడను వైతుము–పూలదండలు భక్తితో!!' కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి కలం నుంచి వెలువడిన ఈ గీతం మన వీరుల పట్ల నాటి మన సమాజానికి ఉన్న భక్తి భావానికి దర్పణంగా నిలుస్తుంది. వీరుల వీరగాథలను పాటల రూపంలో, గేయాల రూపంలో వర్ణిస్తూ నాటి సాహిత్యం సమాజంలో దేశభక్తిని పెంపొందింపజేసేది. అయితే, కాలం మారింది. కాలంతో పాటు సాహిత్యం, దానితో పాటు సమాజ విలువలు కూడా మారిపోయాయి. ఈ మార్పుల పరిణామ క్రమంలో మన దేశ రక్షణలో తమ ప్రాణాలను బలిపెట్టిన వివిధ ప్రాంతాల మహా వీరులెందరినో మనం మరిచిపోయాం. ఆ విధంగా మరచిపోబడిన వారిలో మన తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన వీరచక్ర అవార్డీ (మరణానంతరం వచ్చింది) కెప్టెన్ విజయరఘునందన్‌రావు కూడా ఒకరు.

1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో మిలిటరీలోని గూర్ఖా రైఫిల్స్ విభాగానికి చెందిన కెప్టెన్ విజయరఘునందన్‌రావు తన దళానికి సారథ్యం వహించి అఖ్నూర్-చాంబ్ సెక్టార్‌లో పాకిస్థాన్ సైన్యంతో పోరాడుతూ శత్రువుల బుల్లెట్ల దాడికి గురై 1965, సెప్టెంబర్ 17న యుద్ధభూమిలోనే వీర స్వర్గం పొందారు. తన శరీరం నుంచి రక్తం వెల్లువలా ప్రవహిస్తున్నా, తనకవి చివరి క్షణాలని తెలిసినా లెక్క చేయకుండా తన కింది కమాండర్‌కు తన బాధ్యతలను అప్పగిస్తూ శత్రువుతో పోరాడమని ప్రోత్సహిస్తూ తుదిశ్వాస విడిచాడు. ఆయన త్యాగం ఆ సెక్టార్‌లో మన దేశానికి విజయాన్నందించింది. ఆయన త్యాగాన్ని, నేతృత్వాన్ని, పోరాట పటిమను గుర్తించిన భారత ప్రభుత్వం 1966లో వీరచక్ర పురస్కారంతో (మరణానంతర) గౌరవించింది. ఆయన బెటాలియన్‌కు, ఉమ్మడి ఏపీ రాష్ర్టానికి అదే మొదటి వీరచక్ర పురస్కారం. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోనాల గ్రామంలో 1939, ఆగస్టు 5న బోనాల కూచగిరిరావు-కాంతమ్మ దంపతులకు విజయ రఘునందన్‌రావు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం బోనాలలోనే జరిగింది. ఇక, హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ హైస్కూల్ నుంచి, మెట్రికులేషన్, నిజాం కాలేజీ నుంచి ఇంటర్, ఓయూ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. ఇంటర్మీడియెట్ రోజుల్లోనే ఆయన ఎన్‌సీసీలో చేరి ఉత్తమ క్యాడెట్‌గా, రైఫిల్‌మెన్‌గా గుర్తించబడినారు. న్యాయశాస్త్ర పట్టా ఉన్నందువల్ల న్యాయవాదిగా వృత్తిని ఆరంభించి, రెండుచేతులా సంపాదించే అవకాశం ఉన్నా, దేశభక్తిని తన అణువణువునా రంగరించుకొన్న విజయ రఘునందన్‌రావు మిలిటరీలో చేరాలనుకొని 1962లో జాయింట్ సర్వీసింగ్ వింగ్ నిర్వహించిన ఎంపిక పరీక్షలో దక్షిణ భారతంలోనే ప్రథముడిగా నిలిచి సైన్యంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమించబడ్డారు. తన కృషి ఫలితంగా తన ప్రతిభా పాటవాలతో అతి కొద్ది కాలంలోనే కెప్టెన్ పదవిని పొందారు. 1965లో ఆయన స్వర్గస్థుడయ్యేనాటికి ఆయన వయస్సు 26 ఏండ్లు మాత్రమే.

ఆయన స్మృతి చిహ్నంగా 2000లో కరీంనగర్ పట్టణంలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. అప్పటి రక్షణమంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతేగాక కరీంనగర్ ఐబీ గెస్ట్‌హౌజ్ నుంచి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే మార్గానికి కెప్టెన్ విజయ రఘునందన్‌రావు రోడ్‌గా నామకరణం చేశారు. వీటితో పాటు బోనాల-సిరిసిల్ల రోడ్ మార్గంలో విజయ నగరమనే ఊరు వెలసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం 7వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో గర్వించదగిన తెలుగు బిడ్డ కెప్టెన్ విజయ రఘునందన్ రావు శీర్షికతో ఒక పాఠ్యాంశాన్ని రూపొందించింది. ఏదేమైనా అతి పిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన కెప్టెన్ విజయ రఘునందన్ రావు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం, భావితరాలకు పూజనీయం.